## క్లుప్తంగా

### యువతకు ఆరోగ్యం, పరిశుభ్రతపై శ్రద్ధ అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా జూనియర్ కళాశాలలో శనివారం అడాల్సెంట్ ఏజ్ హెల్త్ అండ్ హైజీన్‌పై ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు సర్వైకల్ వాక్సిన్ గురించి విద్యార్థినులతో చర్చించారు. మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలపై వారి సందేహాలను నివృత్తి చేశారు. అవగాహన సదస్సును కళాశాల ప్రోగ్రాం కో–ఆర్డినేటర్లు బిందు, వాణిలత, వాణిగ్రేస్ పర్యవేక్షించారు.

### తమ్ముడిపై పెట్రోలు పోసి నిప్పంటించిన అన్న

నగరంపాలెం: తమ్ముడిపై అన్న పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటన శుక్రవారం రాత్రి నగరంలో చోటు చేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డితోటకు చెందిన కె.సురేష్ ఆటోడ్రైవర్. పదేళ్ల కిందట అతను మీరాబీని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. అయితే, సురేష్‌కు పెద్ద అన్న రమేష్‌తో విభేదాలున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మణిపురం బ్రిడ్జి సమీపాన సురేష్‌పై రమేష్ పెట్రోలు పోసి నిప్పంటించాడు. స్థానికులు గుర్తించి, సురేష్ భార్యకు సమాచారం అందించారు. మంటల్లో గాయపడిన భర్తను భార్య జీజీహెచ్‌లో చేర్పించగా, పాత గుంటూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు మొబైల్ షాప్ ఓనర్స్, టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 2/3వ అడ్డరోడ్డులోని వైన్ డీలర్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం మొబైల్‌షాప్ ఓనర్స్, టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్ష పదవికి మొహమ్మద్ మొబీన్‌బాషా, షేక్ బాబు (సెల్‌బాబు), కార్యదర్శి పదవికి పఠాన్ జుబేర్‌ఖాన్, తియ్యా వేణుగోపాల్ పోటీ పడుతున్నారు. కోశాధికారిగా షేక్ జిలాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం రెండేళ్లు కొనసాగునుంది. అసోసియేషన్‌లో 300 మంది సభ్యత్వం ఉన్నారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. సాయంత్రంకల్లా గెలుపు, ఓటమి తేలుందని ఎన్నికల పరిశీలకులు తెలిపారు. అయితే, ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎన్నికలు నిర్వహించడంతో నువ్వా–నేనా అనే రీతిలో పోటీ జరగనుంది.

### సురవరంసుధాకర్ రెడ్డికి ఘన నివాళులు



లక్ష్మీపురం: సీపీఐ జాతీయ పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి సీపీఐ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొత్తపేటలోని జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి పేద ప్రజల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు అని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి ఉపన్యాసం మొదలుపెడితే ఎంతసేపైనా వినాలని అన్పిస్తుందని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, ఏపీ అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బండారపు యశ్వంత్ శశి, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### విశ్వ రహస్యాల అన్వేషణలో ఇస్రో విశేష కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: విశ్వ రహస్యాల అన్వేషణలో ఇస్రో విశేష కృషి అసామాన్యమని పూర్వ ఇస్రో, నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా మంగళగిరి మండలం కాజాలోని ఎస్ఎస్‌వీ ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థులకు అంతరిక్ష అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంబశివరావు మాట్లాడుతూ చంద్రయాన్–3లో భాగంగా చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా ల్యాండ్ అయిన విజయానికి గుర్తుగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. అంతరిక్ష పరిజ్ఞానంపై భావితరాలకు అవగాహన కలిగించేందుకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఆర్యభట్ట నుంచి గగన్‌యాన్ వరకు ప్రాచీన నుంచి అనంతమైన అవకాశాలు అనే అంశంపై ప్రస్తుత ఏడాది అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారని వివరించారు. చిల్డ్రన్ స్పేస్ క్లబ్ అధ్యక్షుడు జి.శాంతమూర్తి మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2040లో చంద్రునిపైకి మానవులను పంపేందుకు పరిశోధనలు సాగిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి జాయ్, జీఎం మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అప్పిరెడ్డి, నేతలు



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

నెహ్రూనగర్: ప్రకాశం పంతులు జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్సీ, ఆంధ్రకేసరి అభిమాన సంఘం గౌరవ అధ్యక్షులు లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఆంధ్రకేసరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో శనివారం శంకర్ విలాస్ సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ 1922లో సహాయ నిరాకరణ ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న సమయంలో 30వేల మంది స్వచ్ఛందకులతో గుంటూరులో ప్రకాశం పంతులు భారీ ప్రదర్శన నిర్వహించారనీ, తద్వారా నగరంతో ఆయనకు గట్టి సంబంధం ఏర్పడిందని వివరించారు. దానికి గుర్తుగానే ఆనాడు తామంతా కమిటీగా ఏర్పడి, ఆయన పాదయాత్ర చేసిన ఈ ప్రాంతంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ప్రకాశం చౌక్‌గా నామకరణం కూడా చేసుకున్నామని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, దూపాటి వంశీ, వెలుగూరి రత్నప్రసాద్, బత్తుల దేవానంద్, ఓర్పు శ్రీనివాసరావు, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, గులేచా, భాగ్యారావు, ప్రసన్న, శోభన్, శ్రీనివాసరావు, గిరి, నాని, రామకృష్ణ, అనిల్ బెహరా, ఆదిలక్ష్మి, విజయమ్మ, షేక్ రబ్బాని, మంత్రి మహానంది, బైరెడ్డి రవీంద్రారెడ్డి, సుబ్బరాజు, నవీన్, సబీల్, నారాయణ, వెంకటరమణ, కోటేశ్వరరావు, జాన్ పాల్గొన్నారు.

**అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఘన నివాళి**

లక్ష్మీపురం: సమాజాభ్యుదయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహామనీషి టంగుటూరి ప్రకాశం అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త, విశ్లేషకులు ఈ.చంద్రయ్య అన్నారు. అరండల్‌పేట అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ స్ఫూర్తితో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, దేశం కోసం ప్రకాశం సర్వస్వం త్యాగం చేశారని తెలిపారు. సీనియర్ అధ్యాపకులు సి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రకాశం త్యాగ దీక్ష, కార్యదక్షత గల మహానాయకుడని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# యువతకు ఆర్థిక అక్షరాస్యత అవసరం



రిసోర్స్ పర్సన్ విజయ్‌కుమార్‌తో ప్రిన్సిపాల్ గోపీచంద్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: యువతకు ఆర్థిక అక్షరాస్యత అవసరమని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ పేర్కొన్నారు. కళాశాలలో కోటక్ సెక్యూరిటీస్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ ఆధ్వర్యంలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు ఆర్థిక పరిజ్ఞానంపై రెండు రోజుల పాటు నిర్వహించిన సర్టిఫికెట్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోపీచంద్ మాట్లాడుతూ విద్యార్థులు, యువతరంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆర్థిక అంశాలపై అవగాహన, క్రమశిక్షణ అవసరమని తెలిపారు. కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్ మాట్లాడుతూ స్టాక్ ఎక్స్ఛేంజ్ వంటి సంస్థల్లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. రిసోర్స్ పర్సన్ చిలుకూరి విజయ్‌కుమార్ మాట్లాడుతూ పెట్టుబడి ప్రాధాన్యత, సెక్యూరిటీ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి జాగ్రత్తలు, పెట్టుబడిదారుల రక్షణ, ఫిర్యాదుల పరిరక్షణ యంత్రాంగం, ఆర్థిక అక్షరాస్యత, బడ్జెట్, పొదుపు, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అనేక రకాల ఫైనాన్షియల్ సెక్యూరిటీ మార్కెట్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ఎం. అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అప్పాజ్యోస్యులకు కళా విపంచి పురస్కారం



సత్యనారాయణకు పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు



'పాప దొరికింది' హాస్య నాటికలో సన్నివేశం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా తెలుగు వెలుగు ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో జరగ్గా, గౌరవాధ్యక్షులు రామరాజు శ్రీనివాసరావు సభాధ్యక్షత వహించారు. అనంతరం ఆచార్య అప్పాజ్యోస్యుల సత్యనారాయణకు తెలుగు వెలుగు ఆత్మీయ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. పలు రంగాల్లో, దేశ విదేశాలలో తెలుగు అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషి మరువ లేనిదని వక్తలు కొనియాడారు. ఆరాధన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గోవిందరాజులు నాగేశ్వరరావు రచన, నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించిన పాప దొరికింది (హాస్య నాటిక) నాటిక ఆహూతులను అలరించింది. సభలో నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రముఖ సాహితీవేత్త కందిమళ్ల సాంబశివరావు, సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు కేసీపీ సిమెంట్ వజ్జా మధుసూదనరావు, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కళాపోషకులు డి.రామకోటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం కళాకారులను, అతిథులను సత్కరించారు.

# అష్టలక్ష్మీ అమ్మవారికి లక్ష గాజుల పూజ



లక్ష గాజులతో అమ్మవారు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కోటి కుంకుమార్చనలు శనివారం ముగిశాయి. ఉదయం శ్రీ చక్ర మహామేరుకు విశేషాభిషేకార్చన, లక్ష గాజులతో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. శాంతి హోమం, మహా పూర్ణాహుతి, నక్షత్ర హారతి, మంత్రపుష్పం కలశాల జలంతో భక్తులకు సంప్రోక్షణ జరిగింది. కోటి కుంకుమార్చన ఉత్సవాలకు సహకరించిన వేద పండితులను ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ అభినందించారు.

# ఆటో, ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆటో ఉదయం లేచి చూసే సరికి కనిపించక పోవడంతో బాధితుడు ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. కొత్తకాలనీకి చెందిన పాలపర్తి అంకమ్మరావు ఆటో డ్రైవర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 10న రాత్రి ఇంటి ముందు ఆటో పార్కింగ్ చేసి మరుసటి రోజు లేచి చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల, రైల్వే స్టేషన్, బస్టాండ్ పార్కింగ్ ప్రదేశాలలో వెతికినా కనిపించక పోవడంతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశాడు.

- ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీపై నగరంపాలెం పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. కోదండ రామయ్యనగర్ ప్రాంతానికి చెందిన చింతా అయ్యప్ప ఈనెల 9న ఇంటి ముందు ద్విచక్ర వాహనం పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు చూసే సరికి కనిపించలేదు. శనివారం రాత్రి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

### ఆకట్టుకున్న వన మహోత్సవ ర్యాలీ



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డు నగరాలులోని ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల పరిసర ప్రాంతాల్లో పచ్చదనంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ చాటుతూ నినాదాలు చేశారు. ర్యాలీలో విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మద్యం మత్తులో దాడి

లక్ష్మీపురం: షాపులో మద్యం తాగుతూ మత్తులో ముగ్గురు కలిసి ఓ యువకుడిపై దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. కె.వి.పి. కాలనీ 1వ లైన్ ప్రాంతానికి చెందిన బంగారపు మణికుమార్ కూరగాయాల మార్కెట్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. శనివారం రాత్రి కృష్ణబాబు కాలనీలో ఓ వైన్ షాపులో మద్యం తాగుతున్న సమయంలో అక్కడే ఉన్న వేణు, సాయి, శేఖర్‌లతో వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ముగ్గురు యువకులు కలిసి మణికుమార్‌పై దాడి చేసి గాయపరిచారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం మణికుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి

వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు కచ్చితంగా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ కె.అరవింద్ తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెస్ట్ డివిజన్‌లోని పట్టాభిపురం, నగరంపాలెం, అరండల్‌పేట ప్రాంతాల్లో నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. పబ్లిక్ ప్రదేశాలలో మండపాలు ఏర్పాటు చేసేవారు మున్సిపల్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మండపాలు, విగ్రహాలు ఎక్కడ ఏర్పాటు చేసినా ప్రజలకు, ట్రాఫిక్‌కి ఎటువంటి ఆటంకం కలగరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఊరేగింపు తేదీలు, కార్యక్రమ వివరాలు ముందుగానే పోలీసులకు తెలియజేయాలని వాహన డ్రైవర్ల ఆధార్ కాపీలు, వివరాలు ఇవ్వాలని సూచించారు.

# ఏపీపీ పల్లపు కృష్ణకు సత్కారం



కృష్ణను సత్కరిస్తున్న జడ్జి నీలిమ, కోర్టు సిబ్బంది

నగరంపాలెం: గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించిన పల్లపు కృష్ణ శనివారం రిలీవయ్యారు. జిల్లా కోర్టు ఆవరణలో ఆయన్ను జడ్జి కె.నీలిమ, కోర్టు సిబ్బంది సత్కరించారు. 18 నెలలు సమర్థంగా ప్రాసిక్యూషన్ నిర్వహించి, తొమ్మిది కేసుల్లో శిక్షలు పడేలా కృషి చేశారని వక్తలు ప్రశంసించారు. పల్లపు కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నాగార్జునసాగర్ పీఎస్ పరిధిలోని గిరిజన మహిళపై గ్యాంగ్ రేప్, మేడికొండూరు పీఎస్ పరిధిలో ఓ మహిళపై జరిగిన గ్యాంగ్ రేప్ కేసుల్లోనూ నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసినట్లు చెప్పారు. అరండల్‌పేట పీఎస్ పరిధిలోనూ మహిళా న్యాయవాదిపై జరిగిన హత్య కేసులోనూ నిందితులకు జీవిత ఖైదు పడిందని గుర్తుచేశారు.

# గ్రీన్ గుంటూరే లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు

నెహ్రూనగర్: మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా దశల వారీగా ఐదు లక్షల మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా కీలకమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కావటి శంకరరావు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులతో మానవహారం, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో దశల వారీగా మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేసుకున్నామని తెలిపారు. విద్యార్థులు తమ ఇళ్లల్లో నాటడానికి ఏ మొక్కలు కావాలో హెచ్‌ఎంకు తెలిపితే అవి నగరపాలక సంస్థ నుంచి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల జ్యోతి పద్మజ, ఏడీహెచ్ శాంతి, స్కూల్ హెచ్‌ఎం సీతారాములు పాల్గొన్నారు.

**ప్రధాన రోడ్లను శుభ్రంగా ఉంచాలి**

నగరపాలక సంస్థ పరిధిలో ఉదయం ప్రధాన రోడ్లను డివైడర్ వరకు సమగ్రంగా స్వీపింగ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య కార్మికులను ఆదేశించారు. శనివారం శ్యామల నగర్, ఎన్జీఓ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, నల్లకుంట, శ్రీనివాసరావుతోట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లు స్వీపింగ్ చేసేప్పుడు సెంట్రల్ డివైడర్ వెంబడి కూడా శుభ్రం చేసేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అనంతరం జీటీ రోడ్డు, శ్రీనివాసరావుతోట మెయిన్ రోడ్లను పరిశీలించారు. రోడ్డు, డ్రెయిన్ ఆక్రమణల తొలగింపు చేపట్టాలని పట్టణ ప్రణాళిక

### మందు బాబులు ముగ్గురిపై కేసు

లక్ష్మీపురం: బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురిపై నగరంపాలెం పోలీసులు కేసులు నమోదు చేశారు. చుట్టుగుంట, కె.వి.పి కాలనీ వీఐపీ రోడ్డులో శనివారం రాత్రి నగరంపాలెం పోలీసులు తనిఖీలు చేస్తున్న నేపథ్యంలో ముగ్గురు బహిరంగంగా మద్యం తాగుతున్నట్లు గమనించారు. వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. బహిరంగంగా మద్యం తాగి అసభ్యకరంగా ప్రవర్తించినా, గంజాయి, మత్తు పదార్థాలు తీసుకుని దుర్భాషలాడినా, స్థానికులను ఇబ్బందులకు గురిచేసినా తక్షణమే తమ దృష్టికి తీసుకు రావాలని నగరంపాలెం సీఐ నజీర్ బేగ్ కోరారు.


## ఇది చెరువు కాదు.. ఆర్టీసీ స్థలం !



నగరంపాలెం: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని రైతు బజార్ వెనుక ఖాళీ స్థలం పచ్చని తటాకంతో నిండింది. రెండు ఎకరాల స్థలంలో గతంలో ఆర్టీసీ బస్‌లు, డిపో అధికారుల వాహనాలను నిలుపుదల చేసేవారు. అప్పట్లో ఈ స్థలాన్ని లీజు పద్ధతిలో అప్పగించాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. అయితే, అది కార్యరూపం దాల్చలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు వర్షం నీరు అందులోకి చేరింది. బయటకెళ్లేందుకు మార్గం లేకపోవడంతో అక్కడే నిలిచిపోయింది. ఈ క్రమంలో నీటిపైన ఆకు ఏర్పడింది. పచ్చని రంగేసినట్టుగా తయారైంది. అంతేగాక అటుగా వచ్చే వ్యక్తులు మల, మూత్రవిసర్జనకు వాడుతున్నారు. దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. బస్టాండ్‌కు వచ్చే, పోయే ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి స్థలాన్ని వాడుకంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

# తిన్నది అరగకపోతే తిప్పలే !

- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న ఉదర సమస్యలు
- గ్యాస్ట్రో పెరేసిస్ బారిన పడుతున్న యువత
- అవగాహన మాసంగా ఆగస్టు







గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలితో సరైన సమయానికి భోజనం చేయకపోవడం వల్ల అనేక అనర్థాలు తలెత్తుతున్నాయి. ఒత్తిడితో కూడిన జీవన శైలితో ఎక్కువ మంది మధుమేహ వ్యాధి బారిన పడుతున్నారు. వ్యాధి నియంత్రణలో లేకపోవడం ద్వారా జీర్ణకోశ సంబంధిత సమస్యలు సైతం ఉత్పన్నమవుతున్నాయి. వేళాపాళా లేకుండా తినడం ద్వారా తిన్నది అరగక గ్యాస్ట్రో పెరేసిస్ అనే సమస్య ఉత్పన్నమవుతుంది. జీర్ణాశయానికి వాతం సోకడాన్నే గ్యాస్ట్రో పెరేసిస్ అంటారు. ముఖ్యంగా యువత ఈ వ్యాధి బారిన పడడం ఆందోళనకరమైన అంశమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు పేర్కొంటున్నారు. ఆగస్టు నెల గ్యాస్ట్రో పెరేసిస్ అవగాహన మాసం సందర్భంగా ప్రత్యేక కథనం.

**కారణాలు**

వ్యాధి రావడానికి పూర్తి కారణాలు తెలియదు. కొన్ని సందర్భాల్లో కడుపు కండరాలను (వాగస్ నరాలు) నియంత్రించే నరాలు దెబ్బతినడం వల్ల ఇది సోకుతుంది. వాగస్ నాడి జీర్ణ వ్యవస్థలోని సంక్లిష్టమైన కార్యకలాపాలను నియంత్రిస్తుంది. కడుపు కండరాలను సంకోచించడం, చిన్నప్రేగులోకి ఆహారాన్ని నెట్టడం, వంటివి చేస్తుంది.

**బరువు తగ్గుతారు**

గ్యాస్ట్రో పెరేసిస్ వ్యాధి సోకిన వారు తగినంత ఆహారం తినలేరు. కొంచం తిన్నా కడుపు నిండిపోయినట్లు అనుభూతి కలుగుతోంది. తద్వారా బాధితులు ఎక్కువ ఆహారం తినలేక బరువు తగ్గుతారు. తగినంత మోతాదులో ఆహారం తీసుకోకపోవడం ద్వారా శరీరానికి కావాల్సిన ముఖ్యమైన పోషకాలను సైతం కోల్పోతారు. రోగుల ఆహారం, జీవన శైలిలో మార్పులు చేయడం ద్వారా సమస్యను తగ్గించవచ్చు.

**ఫైబర్ తక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి**

వ్యాధి బాధితులకు ఫ్యాట్, ఫైబర్ తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయి. తక్కువ మొత్తంలో వీలైతే రోజుకు నాలుగు నుంచి ఐదు సార్లు ఆహారం తీసుకోవాలి. భోజన సమయంలో జీర్ణక్రియకు సహాయ పడేలా ద్రవ పదార్థాలు తీసుకోవాలి. బ్రకోలి, క్యాబేజీ, బీన్స్, బెల్‌పెపర్స్ వంటి కూరగాయలు తీసుకోకూడదు. జున్ను, క్రీమ్, వెన్న, కొవ్వు అదనంగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.

ఆహారంలో తగ్గిన పోషకాలను భర్తీ చేసుకోవడానికి ప్రతిరోజూ మల్టీ విటమిన్స్ టాబ్లెట్స్ తీసుకోవాలి. భోజనం చేసిన వెంటనే పడుకోకుండా సుమారు రెండు గంటల సేపు వేచి ఉండి నిద్రించాలి. భోజనం చేసిన తరువాత కొంచెం దూరం నడవడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయి. ధూమపానం, మద్యపానం మానివేయాలి. కార్బొనేటెడ్ డ్రింక్స్ తాగకూడదు. ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం ద్వారా ఉపయోగం ఉంటుంది.

**వ్యాధి లక్షణాలు**

జీవనశైలిలో మార్పులతో, వయస్సు పెరిగే కొద్ది గ్యాస్ట్రో పెరేసిస్ సమస్యలు వస్తున్నాయి. ఇది సోకిన వారికి తిన్న ఆహారం కడుపు ఖాళీ అవడానికి చాలా సమయం పడుతుంది. తద్వారా వికారం, వాంతులు, గుండెల్లో మంట, ఉబ్బరం, కడుపు నొప్పి, కొంచెం తిన్నా కడుపు నిండుగా ఉన్నట్లు అనిపించడం, ఆకలి లేకపోవడం, రక్తంలో చక్కెర స్థాయిలో మార్పులు, తదితర లక్షణాలు కనిపిస్తాయి.

**జీవన శైలి మార్పుతో నివారణ**



జీవన శైలిలో మార్పుల ద్వారా గ్యాస్ట్రో పెరేసిస్‌ను నివారించవచ్చు. మధుమేహ బాధితులు షుగర్‌ను నియంత్రణలో పెట్టుకోవాలి. ధూమపానం, మద్యపానం మానివేయాలి. ఆహారాన్ని పూర్తిగా నమిలి మింగాలి. జీర్ణక్రియను నెమ్మది చేసే జిడ్డుతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం మానేయాలి. ప్రతిరోజూ నీరు ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

### అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాజేష్



నెహ్రూనగర్: అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బోరుగడ్డ రాజేష్‌కుమార్ నియమితులయ్యారు. నగరంలో సంఘ కార్యవర్గ సమావేశం శనివారం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించారు. అందులో రాజేష్‌కుమార్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ వీరాస్వామి నియామక పత్రం జారీ చేశారు.